# పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ నిరర్ధకత

**గడుస్తున్న** ప్రతిరోజూ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నిరర్ధకత మరింతగా, మరింతగా వెల్లడవుతోంది. సోవియట్ యూనియన్ రద్దయిన తర్వాత; తూర్పు యూరపు దేశాలలో సామ్యవాదవ్యవస్థలు అంతరించిన తర్వాత; చైనా, వియత్నాం తదితర కమ్యూనిస్టు దేశాలలో ఆర్థికవ్యవస్థలు పెట్టుబడిదారీ పంథాను చేపట్టిన తర్వాత దశాబ్దాలకాలంగా అమెరికా సామ్రాజ్యవాద నాయకత్వంలో పెట్టుబడిదారీ విధానం నయాఉదారవాద ప్రపంచీకరణ విధానాలను యావత్ ప్రపంచంపై రుద్దుతూ, వాటిని అమలుచేస్తోంది. మరోవైపున ప్రపంచ మానవాళి అభివృద్ధి, సౌభాగ్యాలకు మరో ప్రత్యామ్నాయమే లేదని, తనకు తాను ఘనంగా ప్రకటించుకుంటోంది. కమ్యూనిజానికి కాలంచెల్లిందనే తప్పుడు ప్రచారాన్ని అది సాగిస్తోంది. దీనితో ప్రపంచ ప్రజానీకంలో ప్రత్యేకించి విద్యావంతుల నడుమ – ప్రపంచాన్ని, మానవజాతిని సర్వ బాధలకు గురిచేస్తున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ దుర్గుణా లన్నింటికీ పెట్టుబడిదారీ విధానము మాత్రమే ఏకైక పరిష్కారమార్గమనే–భ్రమలను వ్యాపింపజేస్తోంది. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం ఓ తప్పుడు అభిప్రాయాన్ని ప్రతిభావంతంగా ప్రపంచంలో వ్యాప్తిచేసి, ప్రపంచ ప్రజానీకపు ఆలోచనలలో స్థిరపరుస్తూంది. ప్రపంచవ్యాపితంగా బడాపెట్టుబడిదారుల యాజమాన్యంలో, వారి అదుపులోనున్న ప్రచార, ప్రసార మాధ్యమాలు పెట్టుబడిదారీ వ్యవస్థను గురించిన తప్పుడు అభిప్రాయాలను, భ్రమలను నిర్విరామంగా ప్రచారం గావిస్తూ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సమాచార, యాంత్రీకరణ సాంకేతికలో గొప్ప ఆవిష్కరణల పరిణామాన్ని చూపెట్టి, ఈ విధమైన సాంకేతిక అభివృద్ధి అంతా, ప్రపంచ మానవాళి అభ్యున్నతేననే తప్పుడు అభిప్రాయాలను వ్యాప్తిచేస్తున్నాయి.

ఏమైనా, నిజజీవితంలో ప్రజల వాస్తవిక జీవన పరిస్థితులు–పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న ఈ రకమైన దుష్ప్రచారపు డొల్లతనాన్ని వెల్లడిచేయటమేగాక – పెట్టుబడిదారీ విధానం మరియు పెట్టుబడిదారీ వ్యవస్థల నిరర్థకతను చాటిచెప్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థే, ప్రపంచ మానవాళి యొక్క దురవస్థలన్నింటికీ, వారు అనుభవిస్తున్న దుర్భర సామాజిక, ఆర్థిక స్థితిగతు లన్నింటికీ – వాస్తవిక, మూలకారణమని పై వాస్తవాలు బలంగా నొక్కి చెబుతున్నాయి. ప్రతి సంవత్సరమూ ప్రపంచ వ్యాపితంగానున్న ధనాఢ్య వర్గాలు, కులీన వర్గానికి చెందిన వారంతా 'ప్రపంచ ఆర్థిక వేదిక' పేరుతో దావోస్‌లో సమావేశమై, ధనాఢ్య వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే పథకాలనూ, విధానాలనూ రూపొందించుకుంటారు. ఆ విధమైన పథకాలను రూపొందించుకునే ముందుగా ప్రపంచ ప్రజల ఆర్థిక స్థితిగతుల గురించి సర్వేలు నిర్వహించి, ఆ నిర్ధారణల ప్రాతిపదికగా, వారు తమ నూతన పథకాలకు రూపకల్పన చేస్తారు.

ఈ కాలమంతటా, పెట్టుబడిదారీ విధానం – "ప్రపంచీకరణ విధానాలద్వారా సమ్మిళిత అభివృద్ధిని సాధించటం" అనే తన నినాదంతో ప్రపంచ ప్రజానీకంలో భ్రమలు వ్యాపింపజేసింది. అయితే వారే స్వయంగా నిర్వహించుకున్న సర్వేల నివేదికల్లో, వెల్లడైన నిర్ధారణలు – "సమ్మిళిత అభివృద్ధి" అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని విపులంగా, స్పష్టంగా వాటికవే వెల్లడి చేస్తున్నాయి. వాస్తవానికి అభివృద్ధిగా చెప్పబడేదంతా అభివృద్ధిచెందిన సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలకు చెందిన కొద్దిమంది బడాపెట్టుబడిదారులకు మాత్రమే పరిమితమైంది. కాగా, మిగిలిన అభివృద్ధిచెందుతున్న, వెనుకబడిన దేశాల ఆర్థికవ్యవస్థలన్నీ ఏవిధమైన అభివృద్ధికీ నోచుకోకుండా మరింతగా పతనమయ్యాయి.

రోజురోజుకీ ధనిక–నిరుపేదల మధ్య అంతరాలు పెరిగిపోతుండటాన్ని, ఆదాయాల మధ్య అంతరాలు పరిగణించదగిన స్థాయిలో పెరగుతూండటాన్ని 'ప్రపంచ ఆర్థిక వేదిక' తన సర్వే ద్వారా కనుగొని, గుర్తించింది. సృష్టించబడుతున్న సంపద చాలా అసమానంగా పంపిణీ చేయబడటం – అసమ్మతి, అసంతృప్తులు తీవ్రంగా పెరిగిపోవటానికి; తద్వారా పెట్టుబడిదారీ విధాన ప్రయోజనాలకు హానికరమైన రాజకీయాలు వేగం పుంజుకొని, పెట్టుబడిదారీ వ్యవస్థకే ముప్పుగా పరిణమించాయని ప్రపంచ ఆర్థికవేదిక పేర్కొంది. బ్రెగ్జిట్, అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవటం, ఇటలీలో అతిమితవాద శక్తుల పెరుగుదలకు దోవతీసిన పరిణామాలు, యూరప్‌లో తదనుగుణమైన సిద్ధాంతాల వ్యాప్తివంటి పరిణామాలన్నింటికీ నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలే కారణమని కూడా ప్రపంచ ఆర్థికవ్యవస్థ గుర్తించింది.

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు జరగబోతున్న నేపథ్యంలో – ప్రపంచ స్థితిగతులు, వాని విశ్లేషణలను ఆక్స్‌ఫామ్ సంస్థ ప్రకటించింది. ఈ నివేదిక మరింతగా పెట్టుబడిదారీ వ్యవస్థ నిరర్ధకతను వెల్లడి చేసింది. పెట్టుబడిదారీవ్యవస్థ ప్రచారంచేసిన అబద్ధాలను ఇది వెల్లడి చేసింది.

ప్రపంచవ్యాపితంగా పరిగణించదగిన స్థాయిలకు అసమానతలు పెరుగుతున్నాయని ఈ నివేదిక నొక్కి చెప్పింది. ఈ అసమానతలు మరింత అధికంగా పెట్టుబడిదారీ దేశాలలో పెరుగుతున్నాయని, ఆదాయాల నడుమ అంతరాయాలు వేగంగా పెరుగుతున్నాయని; సంపద పంపిణీలో అసమానతలు ప్రమాదకర స్థాయికి పెరిగాయని ఈ నివేదిక నొక్కి చెప్పింది. ప్రపంచంలోని 50శాతం పేదలకు చెందిన ఆస్థికి సమానమైన ఆస్థి, కేవలం 8 మంది శతకోటీశ్వరుల వద్ద పోగుపడి వుందని ఈ నివేదిక పేర్కొంది. 2015 నుండీ ప్రపంచంలోని అత్యంత ధనికులైన ఒక శాతం, మొత్తం ప్రపంచంలోని ఇతరులందరూ పొందుతున్న సంపదకంటే అధికమని ఈ

నివేదిక వెల్లడించింది. గత రెండు దశాబ్దాలుగా చైనా, ఇండోనేషియా, లావోస్, భారతదేశం, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలలోని 10 శాతం అత్యంత ధనికులైనవారి ఆదాయం, సం॥నికి 15 శాతం పైగా పెరుగుతోందని నివేదిక పేర్కొంది. '99శాతం కొరకు ఒక ఆర్థిక వ్యవస్థ' అనే శీర్షిక క్రింద, ధనాఢ్యవర్గాలకు చెందిన కొందరి కోసం కాకుండా, ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే మానవీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన సమయ మాసన్నమైంద'ని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. 2015 తర్వాత కాలంలో ఒక శాతంగా వున్న అత్యంత ధనికులు, భూమండలంపైనున్న సంపదలో అత్యధిక సంపదను హస్తగతం చేసుకున్నారని కూడా ఈ నివేదిక పేర్కొంది.

యాదృచ్ఛికంగా 2017 సం॥కి సంబంధించిన 'ప్రపంచ దేశాలలో ఉద్యోగిత మరియు సామాజిక అవగాహన'పై అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) తన నివేదికను ఈ కాలంలోనే వెలువరించింది. 2017లో ప్రపంచ వ్యాపితంగా నిరుద్యోగ ప్రజానీకపు సంఖ్య 34 లక్షలు పెరుగుతుందని లెక్కవేసింది. ఉద్యోగ కల్పనను మించి కార్మికుల సంఖ్య పెరగనుందని దీనితో ప్రపంచ వ్యాపితంగా నిరుద్యోగుల శాతం 2017లో మరింత పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం- 'ఆర్థికాభివృద్ధి నిరాశాజనకంగానే -స్థాయిల నిబంధనలలోనూ, సమ్మిళిత స్థాయిలోనూ - రెంటిలో దిగువ స్థాయిలో కొనసాగుతుందని' ఈ నివేదిక పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, తగినన్ని ఉద్యోగాలను సృష్టించే దాని సమర్థతకు, ఇదొక ఆందోళనకర పరిణామమని ఈ నివేదిక హెచ్చరించింది. 3.10 డాలర్లకంటే తక్కువ ఆర్జించే కార్మికులు అభివృద్ధి చెందుతున్న దేశాలలో రానున్న రెండు సంవత్సరాలలో 50 లక్షల సంఖ్యను మించి పెరగనున్నారని, ఐఎల్ఓ నివేదిక అంచనావేసింది. గౌరవనీయ ఉద్యోగాల కొరత, సామాజిక అశాంతి అలముకొంటున్న స్థితి, ప్రపంచంలోని పలు దేశాలనుండి సాగుతున్న వలసలు వంటి ప్రపంచస్థాయి అనిశ్చిత పరిస్థితిని గురించి ఈ నివేదిక హెచ్చరించింది.

వాస్తవికంగా పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నిరాశాజనకమైన పాత్ర పోషణ ఈ విధంగా వుండగా, ఇది - నయాఉదారవాద ఆర్థికవ్యవస్థను, సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అత్యంత క్రూరంగా ప్రపంచంపై రుద్దుతోంది. ఇలాంటి స్థితిలో శాస్త్ర, సాంకేతికరంగాలలో అత్యున్నత ప్రమాణాలను సాధించామని పెట్టుబడిదారీ వ్యవస్థ చాటుకోవడాన్ని ఏవిధంగా అర్థంచేసుకోవాలి? కృత్రిమ మేధోసాంకేతిక పరిజ్ఞానాన్నీ, రోబోల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇవి అంతటి క్లిష్టమైన, అర్థం కాలేనంతటి జటిల సమస్యలేంతమాత్రం కావు. ఉత్పత్తి సాధనాలైన ఈ అత్యాధునిక సాంకేతికతపై యాజమాన్యాన్ని ఎవరు కలిగివుంటారో, వారు మాత్రమే మరింతగా, మరింతగా సంపదను కూడబెట్టుకుంటారు. ఇది అత్యంత వాస్తవికమైన అంశం. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి అసాధారణ స్థాయికి పెంపొందినా, ఈ రకమైన సాంకేతికతపట్ల మధ్యతరగతి వర్గాలు భ్రమలు పెంచుకోవలసిన అవసరమేమీ లేదు. ఎందుకంటే, ప్రసిద్ధ బహుళజాతి కార్పొరేషన్ల యజమానులైన బడా పెట్టుబడిదారులే, ఉత్పత్తి సాధనాలపై, అత్యున్నతంగా అభివృద్ధి చేయబడిన సాంకేతిక పరిజ్ఞానంపైన యాజమాన్యం కలిగివున్నారు. ఈ క్రమంలో మధ్యతరగతి వర్గం అనుభవిస్తున్న ఉద్యోగాలు కూడా హరించుకు పోనున్నాయి. ప్రస్తుతం ఈ మధ్యతరగతి వర్గం-నయా ఉదారవాద పెట్టుబడిదారీ వర్గం సృష్టించిన తాత్కాలిక సౌభాగ్య భ్రమాజనిత త్రిశంకుస్వర్గంలో జీవిస్తున్నారు. వారి ఆర్థిక సర్వేలు, నివేదికలు కూడా ఇదే అంశాన్ని స్పష్టంచేస్తున్నాయి.

2017 ఫిబ్రవరి 2వ వారంలో 'వెల్త్-X'సంస్థ వెల్లడిచేసిన ఓ నివేదికలో ప్రపంచంలోని అత్యధిక సంపన్నులైన పదిమంది శతకోటీశ్వరులు 58,200 కోట్ల డాలర్ల సంపదను కలిగివున్నారని తెలిపింది. పైన పేర్కొన్న, ప్రపంచంలో అత్యంత ధనికులైన పదిమందిలో, 9 మంది శతకోటీశ్వరులు అమెరికాకు చెందినవారు కాగా, మిగిలిన ఆ ఒక్కరు స్పెయిన్‌కు చెందినవారు. ఈ ఒక్క వాస్తవమే, అమెరికా సామ్రాజ్యవాద సారం గురించి, పెట్టుబడిదారీ విధాన 'సుగుణాల' గురించి, అది ప్రకటించే డాంబికాల గురించి ఎంతో వెల్లడి చేస్తోంది.

పైన పేర్కొన్న నివేదికలన్నీ-నయాఉదారవాద ఆర్థిక విధానాలను, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను సమర్థించే, ప్రపంచంలోని దుర్గుణాలన్నింటికీ పెట్టుబడిదారీ విధానమే సర్వరోగ నివారిణిగా భావించే సంస్థలు తయారు చేసినవే. ప్రపంచంలో వాస్తవాలపై ఆధారపడిన ఈ సంస్థలు - ప్రపంచంలో అభివృద్ధిని, ప్రగతిని తీసుకురావటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత దారుణంగా విఫలమైందో రుజువుచేస్తున్నాయి. కనుక, పెట్టుబడిదారీ వ్యవస్థ నిరర్థకతను అర్థంచేసుకొని, అంగీకరించేందుకు మరే విద్యాసంబంధమైన రుజువుల యొక్క అవసరమే లేదు.

ప్రపంచంలో వేళ్ళమీద లెక్కించదగిన అత్యధిక సంపద్వంతులను ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ తయారు చేస్తోందని ఈ నివేదికలన్నీ వెల్లడి చేయటంలేదా?!

కనుక, ప్రపంచ ప్రజలకు ప్రగతి, సౌభాగ్యాలను పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకువస్తుందని చెప్పటాన్ని మించిన పెద్ద అబద్ధం మరొకటుంటుందా?! ఇంతకు మించిన మోసకారీతనం, తప్పుదోవ పట్టించడం మరొకటి వుంటుందా?!

ఈ విధంగా - పెట్టుబడిదారీ వ్యవస్థ, అది తనకు తానుగా నిరర్థకమైనది మాత్రమేకాదనీ, సామ్యవాదం, కమ్యూనిజాలే ప్రత్యామ్నాయమని మరో రూపంలో నిర్ధారణ కూడా చేస్తోంది.

కనుక, ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి సామ్యవాద వ్యవస్థను, ఆపై కమ్యూనిస్టు వ్యవస్థలను స్థాపించుకోవటమే ప్రపంచ వ్యాపిత పీడిత ప్రజానీకం ముందున్న తక్షణ కర్తవ్యం.

oooo